

# 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనం





డోలు మోగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరయ్యారు. గిరిజన సోదరులు వివిధ ఉత్పత్తులు, హస్తకళలకు సంబంధించి తమకు ఉండే సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శిం చిన గిరిజన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, గిరిజన వేషధారణలు ఆకట్టుకున్నాయి.

# అభివృద్ధి పండగ



ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌ఐడీఎం పరికరాలను ఆసక్తిగా గమనిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్



మాక్ డ్రిల్ ప్రదర్శిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

## కొండపావులూరులో కొలువుతీరిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు

### ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌ఐడీఎం భవనాలు ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్
- ఆకట్టుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాల మాక్ డ్రిల్

విజయవాడ/గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మండలం కొండపావులూరులో కేంద్ర విపత్తు సంస్థలు కొలువుతీరాయి. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌ఐడీఎం), జాతీయ విపత్తు సహాయక బృందాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్) ప్రాంగణాలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సీఎం చంద్రబాబుతో కలిసి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్‌ఐడీఎం ప్రాంగణాలు పచ్చని చెట్ల మధ్య ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. ఎన్‌ఐడీఎం, ఎన్‌డీఆర్‌ఎఫ్ భవనాలు, వాటి విశిష్టతలను ఆయా సంస్థల విభాగాధిపతులు వివరించారు. తొలుత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎన్‌ఐడీఎం ప్రాంగణానికి చేరుకున్నారు. ఎన్‌ఐడీఎం విభాగాధిపతి క్యాంపస్ గురించి వివరించారు. త్రీడీ ప్రింట్స్‌ను చూపిస్తూ ఆయా బ్లాకులలో ఏమి జరుగుతుందో చెప్పారు. ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్‌లకు ఆయా సంస్థల అధిపతులు యంత్ర పరికరాల గురించి వివరించారు. వీరంతా మిగతా 6లో..

# 1,270 బస్తాల బియ్యం సీజ్



రెవెన్యూ సిబ్బంది దాడి చేసి రేషన్ బియ్యం పట్టుకున్నారు.

గూడూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా, గూడూరు మండలం, రాయవరం గ్రామంలో రైస్ మిల్లుపై ఆదివారం రాత్రి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 25 కేజీల రేషన్ బియ్యం బస్తాలు 1,270 స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం రైస్ మిల్లు యజమానిని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయాల్సిన బియ్యం బస్తాలు సదరు మిల్లులో ఉన్నాయని విజిలెన్స్ అధికారులకు ఆగంతకులు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్ఐ రాధా, విజిలెన్స్ సీఐలు వెంకటేశ్వర్లు, ఉమర్,

## స్వరాభిషేకం

విజయవాడ సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజస్వామి ఉత్సవాల్లో ఆదివారం ఘనరాగ పంచరత్న కృతుల గోష్ఠి గానం నిర్వహించారు. 300 మందికి పైగా కళాకారులు పాల్గొని త్యాగరాజస్వామికి స్వరాభిషేకం చేశారు.

6లో



# వలకట్ల ఆదాయం బొక్కేశారు



వలకట్ల ఆదాయంపై తుమ్మలచెరువు గ్రామంలో వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

## తుమ్మలచెరువులో రూ.14.40 లక్షలు, గిలకలదిండిలో రూ.12లక్షలకుపైగా మాయం

- వైసీపీ నేతల తీరుపై రెండు గ్రామాల ప్రజల ఆగ్రహం
- తుమ్మలచెరువులో ఇరువర్గాల బాహాబాహీ.. పోలీసులు సర్దిచెప్పడంతో తొలగిన ఉద్రిక్తత
- ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద గిలకలదిండి వాసుల వాదులాట
- ముదురుతున్న వలకట్ల ఆదాయం వివాదం
- నిధుల స్వాహాపై తిరగబడుతున్న జనం

గ్రామాల్లో వలకట్లపై వచ్చే ఆదాయాన్ని వైసీపీ నాయకులు దిగమింగిన వ్యవహారంపై రెండు రోజులుగా వివాదం రాజుకుంటోంది. గ్రామాభివృద్ధికి వినియోగించాల్సిన నగదును గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్వాహా చేయడంపై గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఆ నగదును తిరిగి చెల్లించాలని, పూర్తిస్థాయి లెక్కలు చెప్పాలని పట్టుబట్టడంతో వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు దిగుతున్నారు. దీంతో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిలకలదిండి, మచిలీపట్నం మండలం తుమ్మలచెరువు గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద గిలకల దిండి వాసుల వాదులాట

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం మండలం తుమ్మలచెరువు పంచాయతీ పరిధిలోని మురుగు కాలువలలో వలకట్లు, కాలువగట్ల వేలం పాటలు, ఇతరత్రాల రూపంలో పంచాయతీకి ఏటా రూ.10లక్షల ఆదాయం వస్తుంది. ఈ నగదును పంచాయతీలో అభివృద్ధి పనులు, గ్రామంలో ఉన్న నాలుగు ఆలయాల్లో పండుగల సమయంలో ధూపదీప నైవేద్యాలకు ఖర్చుచేస్తారు. గతేడాది జనవరిలో ఈ నగదును లెక్కిస్తున్న సమయంలో వైసీపీ నాయకులు రూ.10 లక్షల నగదు మొత్తాన్ని తమతో పాటు గుంజుకుపోయారు. ఈ అంశంపై అప్పట్లో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నాయకుల ఒత్తిడి కారణంగా ఈ ఘటనకు కారణమైన వారిపై ఎలాంటి చర్యలు మిగతా 6లో..

### గిలకలదిండి వలకట్లలోనూ ఇదే తీరు

గిలకలదిండి పరిధిలోని కాలువల వలకట్లకు వచ్చే ఆదాయాన్ని వైసీపీ నాయకులు స్వాహా చేసిన ఘటనపై వివాదం రాజుకుంటోంది. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు శనివారం గిలకలదిండికి చెందిన మత్స్యకారులు, పెద్దలు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్దకు వెళ్లి మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేశారు. సొసైటీ సభ్యులు, మరికొంత మంది వైసీపీ నాయకులు గత ఏడాది వలకట్లపై వచ్చిన రూ.12లక్షలకుపైగా ఆదాయాన్ని స్వాహా చేశారని, తమ వద్ద ఉన్న లెక్కలతో సహాచూపారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఇరువర్గాలు ఈ అంశంపై వాదులాటకు దిగాయి. వలకట్ల పాటల రూపంలో వచ్చే నగదును కాకుండా, మరో రూ.80వేలను మత్స్యకారుల నుంచి కట్టించుకుని, ఇంకా రూ.5 లక్షలను అప్పుగా చూపుతున్నారని ఇదేం పద్ధతని పలువురు మత్స్యకారులు సొసైటీ సభ్యులను నిలదీశారు. గతంలో వైసీపీ పాలకులు నగదును స్వాహా చేశారని, ఈ అంశంపై విచారణ చేసి నగదును తిరిగి కట్టించాలని గిలకలదిండి వాసులు డిమాండ్ చేశారు.

# అందని అల్పాహారం

## పదో తరగతి విద్యార్థులకు ప్రారంభమైన సాయంత్రం క్లాసులు

### నేటి వరకు జిల్లా పరిషత్ నుంచి మంజూరు కాని నిధులు

### ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.. పట్టించుకోని అధికారులు



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జిల్లా పరిషత్ నుంచి ఏటా నిధులను విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది నిధులు ఇంకా విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం సంబంధిత ఫైలును జెడ్పీకి పంపాం, నిధులు విడుదల కావాల్సి ఉందని చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ఉదయం, సాయంత్రం సమయాల్లో దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు మార్చిలో జరిగే పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 25 వేల మందికిపైగా విద్యార్థులకు డిసెంబరు నుంచి ఈ ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 415 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే నిమిత్తం జిల్లా పరిషత్ నుంచి నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ఏడాదికి రూ.45లక్షలు కేటాయించేవారు. గతేడాది ఈ మొత్తాన్ని రూ.17లక్షలకు కుదించారు. జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయితే కలెక్టర్ ఆమోదంతో ఈ నిధులు ఆయా ఉన్నత పాఠశాలలకు విడుదల అవుతాయి. ఏటా జనవరిలో ఈ నిధులను విడుదల చేస్తే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేవారు. ఈ ఏడాది ఇంకా ఈ నిధులను విడుదల చేయకపోవడంతో అల్పాహారం అందడంలేదు.

### దాతల సహకారం తీసుకుంటారా?

విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో విద్యాశాఖ అధికారులు గ్రామాల్లోని దాతల సహకారంతో ఈ కార్యక్రమానికి నిధులు సమకూర్చుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. అయితే వారు ఈ వ్యవహారంపై అంతగా దృష్టిసారించలేదు.

### జిల్లా పరిషత్‌కు లేఖ రాశాం

జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సాయంత్రం సమయంలో అల్పాహారం ఇచ్చేందుకు ఏటా మాదిరిగానే నిధులు విడుదల చేయాలని జిల్లా పరిషత్‌కు ఇప్పటికే లేఖ రాశాం. నిధులు విడుదలపై ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. నిధులు వచ్చిన వెంటనే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాం.

-పీవీజే రామారావు, డీఈవో

# పొగ దొంగలు!

## కోట్లలో నకిలీ సిగరెట్ల వ్యాపారం

### ఉత్తరాది ముఠాలతో దోస్తీ

- ప్రైవేటు కొరియర్ల ద్వారా వస్తున్న సరుకు
- పన్నుల చెల్లింపులకు ఎగనామం



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అమరావతికి అటు వైపున ఉన్న గుంటూరు, ఇటువైపున ఉమ్మడి కృష్ణాజిల్లాలో 'పొగ' మాఫియా పాతుకుపోతోంది. నకిలీ సిగరెట్ల చలామణికి రెండు జిల్లాలు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకుకు ఉమ్మడి కృష్ణా జిల్లాను కేంద్రంగా మార్చుకుంటున్నారు. అసలు బ్రాండ్లను పోలి ఉండే బ్రాండ్లతో నకిలీ సిగరెట్లను తీసుకొచ్చి కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు. రాష్ట్రం మొత్తానికి నకిలీ సిగరెట్లకు అంటే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు పిన్‌కోడ్‌గా మారుతున్నాయి. ఈ మాఫియా తీరుతో అన్ని అనుమతులతో సిగరెట్లను తయారు చేస్తున్న కంపెనీలు తలలు పట్టుకుంటున్నాయి. తాజాగా సెంట్రల్ జీఎస్టీ అధికారులు అజిత్‌సింగ్‌నగర్, అంబాపురంలో రూ.కోటి విలువ చేసే మిగతా 6లో..

### దర్యాప్తు ఏమవుతున్నట్టు?

సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు విదేశీ బంగారం, నకిలీ సిగరెట్లను సీజ్ చేసినప్పుడు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత దర్యాప్తును పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్మగ్లింగ్ సరుకులను పట్టుకున్నప్పుడు ఒక ప్రకటన విడుదల చేస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. తర్వాత దర్యాప్తు విషయంలో అడుగు ముందుకు పడడం లేదని తెలుస్తోంది. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు సీజ్ చేసిన స్మగ్లింగ్ వస్తువుల కేసుల్లో ఇదే జరుగుతోంది. ఇప్పటి వరకు ఫలానా కేసులో అసలు నిందితులను గుర్తించామని, పట్టుకున్నామని ప్రకటించలేదు. ఈ మొత్తం వ్యవహారం ఆయా సంస్థల అధికారుల తీరుపై అనుమానాలకు తావిస్తోంది. సరుకును సీజ్ చేసినా అసలు నిందితులను పట్టుకోవడానికి అధికారులు అడుగులు వేయకపోవడం మాఫియాకు పెద్ద అవకాశంగా మారుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ మాఫియా వేళ్లూనుకుపోతోందని తెలుస్తోంది.

# యోగి వేమన రచనలు నైతిక విలువలకు పునాదులు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ల క్రితమే ప్రజాకవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలి అనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు వేమన రచించారన్నారు. తెలుగు గడ్డపై ఎంతోమంది కవులకు వేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమసమాజ స్థాపనే అన్న అంశాన్ని 1000 సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగి వేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థులు యోగి వేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

# సంఘ సంస్కర్త యోగి వేమన

» సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కవి, సంఘ సంస్కర్తగా యోగి వేమన దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. యోగి వేమన జయంతి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు. అటువంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ట్రైనీ ఐపీఎస్ మనీషా, సీపీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈఈ

# దుర్గమ్మ సేవలో కేంద్ర మంత్రి బండి సంజయ్

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వారికి ఈఈ వైకుంఠరావు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం.. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.



ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

# అమిత్‌షా రాజీనామా చేయాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని లేదా బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను గౌరవించుకుంటూ ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను సీఎం, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. బీజేపీ నాయకులకు రాజ్యాంగంపై, అంబేడ్కర్‌ను పదేపదే కించపరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ఆపార్టీ నేత ప్రకటించారని గుర్తుచేశారు. అమిత్‌షా రాజీనామా చేసేంత వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, బీజేపీ నేతలకు మనువాదం తలకెక్కిందని విమర్శించారు. సీపీఐ (ఎంఎల్) నేతలు డి.హరినాథ్, పోలారి, ఎంసీపీఐయూ నేత ఖాదర్ బాషా, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పలు వామపక్షాలు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# 22న బాస్కెట్‌బాల్ ఎంపికలు

లబ్బీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న అండర్-23 బాయ్స్ అండ్ గర్ల్స్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్ తెలిపారు. ఆంధ్ర లయోలా కళాశాలలో 22న మధ్యాహ్నం 3గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని, ఎంపికైన జట్లు ఈ నెల 28 నుంచి 31 వరకు విజయవాడలో జరిగే మొదటి ఆంధ్రప్రదేశ్ అండర్-23 ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డ్ జిరాక్స్, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు.

# ఘనంగా పంచరత్న గోష్టిగానం

## సంప్రదాయ దుస్తుల్లో కర్ణాటక సంగీత విద్వాంసులు

» 300 మంది బృందగానం

» ముగిసిన ఆరాధన సంగీతోత్సవాలు





సత్యనారాయణపురం ఘంటసాల సంగీత కళాశాలలో 300 మందికి పైగా కళాకారుల త్యాగరాజ స్వరాభిషేకం

విజయవాడ కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ఎందరో మహానుభావులు అందరికీ వందనము.. చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు.. అంటూ సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న కృతుల గోష్టి గానంలో శ్రోతలను పరమానంద భరితులను చేశారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఉత్సవాల్లో ఆదివారం ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం నిర్వహించారు. 300 మందికి పైగా కళాకారులు పాల్గొని త్యాగరాజస్వామికి స్వరాభిషేకం నిర్వహించారు. ఆ తీయని మధుర గాత్రాలతో సంగీత ప్రియులను అమృత రసరాగ ప్రవాహంలో మునకలు వేయించారు. తొలుత నట రాగం ఆదితాళంలో 'జగదానందకారక జయ జానకీ ప్రాణ నాయకా..' అంటూ పంచరత్నాల్లో తొలి కృతిని పాడి జనరంజకం చేశారు. తదుపరి గౌళ రాగం ఆదితాళంలో 'దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో కడు దుర్విషయాకృష్టుడై గడియ గడియకు నిండాయి..' అంటూ రెండో కృతిని పాడి ఆహూతులను అలరించారు. అరభి రాగం ఆదితాళంలో 'సాధించెనే ఓ మనసా.. బోధించిన సన్మార్గ వచనముల..' అంటూ ప్రారంభించి 'సమయానికి తగు మాటలాడెనే దేవకి వసుదేవుల నేగించినటు..' అనుపల్లవితో ఈ కృతి గానం మరింత సుందర సుధా రసాలను ఒలికించింది. వరాళి రాగం ఆదితాళంలో 'కనక రుచిరా కనకవసన.. నిన్ను దిన దినమున మనసున..' కృతిని పాడి సంగీత విద్వాంసుల బృందం కరతాళధ్వనులు అందుకుంది. చివరిగా ఎందరో మహానుభావులు కీర్తన గానంచేసి భక్తిమార్గంలో ఉన్న మహానుభావుల వైశిష్ట్యాన్ని గుర్తుచేశారు. ప్రారంభం నుంచి చివరివరకూ అంచెలంచెలుగా తారస్థాయినందుకున్న ఈ కీర్తనల గానం సాహిత్యసొగసుతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. కార్యక్రమాన్ని ఆకాశవాణి లైవ్ ప్రసారం చేయగా ప్రతినిధులు పాల్గొన్నారు. అధ్యక్షులు మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

# గన్నవరంలో అమిత్‌షాకు వీడ్కోలు



గన్నవరం విమానాశ్రయం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వీడ్కోలు పలుకుతున్న సీఎం చంద్రబాబు తదితరులు

గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ సంస్థలను ప్రారంభించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రోడ్డు మార్గాన ఆదివారం మధ్యాహ్నం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఘన వీడ్కోలు లభించింది. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కనకమేడల రవీంద్రకుమార్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కాగిత కృష్ణ ప్రసాద్, అరిమిల్లి రాధాకృష్ణ, బత్తుల బలరామకృష్ణ, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, స్వచ్ఛాంధ్ర మిషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, ఎస్పీ గంగాధరరావు, నెట్టెం రఘురాం తదితరులు సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో అమిత్‌షా ఢిల్లీ వెళ్లారు.

# వికసిత్ పంచాయత్ లక్ష్యంగా గ్రామాభివృద్ధి

» ఎంపీ కేశినేని శివనాథ్



కలెక్టర్ లక్ష్మీశతో సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

భారతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 295 గ్రామాలను అభివృద్ధిచేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)అన్నారు. భారతీనగర్‌లోని ఓ హోటల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సమక్షంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ (ఎన్.ఐ.ఆర్.డి) ప్రతినిధులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశతో ప్రత్యేక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలను వికసిత్‌పంచాయత్ దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు, కలెక్టర్ లక్ష్మీశలకు వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న 295 గ్రామాలను రెండున్నర సంవత్సరాల్లోగా సమగ్ర అభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం చేపట్టబోయే కార్యక్రమాలకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు మాట్లాడుతూ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ముందుగా ఈ పైలట్ ప్రాజెక్ట్ చేయపడతామన్నారు. నియోజకవర్గానికి ఆరుగ్రామాలు ఎంపిక చేసి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు నియోజకవర్గాలకు కలిపి 32 మంది సిబ్బందికి హైదరాబాద్‌లో 15రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎన్.ఐ.ఆర్.డి మద్దతుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్‌ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ అంజన్‌కుమార్ బాంజా, ఎన్ఐఆర్‌డి అధికారులు దిలిప్‌కుమార్ పాల్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ చల్లపల్లికి లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం



స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి శాస్త్రికి లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాన్ని అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సినీనటులు బ్రహ్మానందం, గంటా శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

చల్లపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ధకాలంగా చల్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా ఉద్యమానికి లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. విశాఖపట్నంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పుణ్యతిధి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంతో దేశానికే స్ఫూర్తిగా నిలిచిన వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతిలను ఫౌండేషన్ పురస్కారానికి ఎంపికచేశారు. అనివార్యకారణాలవల్ల వారు వెళ్లలేకపోవటంతో స్వచ్ఛ చల్లపల్లి ప్రతినిధిగా విశ్రాంత ఉపాధ్యాయులు, స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి పురస్కారాన్ని స్వీకరించారు. త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఫౌండేషన్ నిర్వాహకులు, మాజీ రాజ్యసభ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పురస్కారం, లక్ష రూపాయల నగదు అందజేశారు.




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

# జగన్ ప్రభుత్వంలో తీవ్రంగా వేధించారు

» మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆవేదన

విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వంలో తనను తీవ్రంగా వేధింపులకు గురిచేశారని.. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన మర్నాడే ఉద్యోగం లేకుండా చేశాడని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కమ్మ వ్యతిరేక పాలసీని తీసుకొచ్చి 2004 నుంచి అమలు చేశారన్నారు. నాడు వైఎస్ నాటిన విత్తనం నేడు విషవృక్షంగా మారింది' అని ఆరోపించారు. విజయవాడలో ఆదివారం కొసరాజు వారి ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడారు. తన 30 ఏళ్ల సర్వీసులో 10-15 ఏళ్లు మాత్రమే సక్రమమైన పోస్టింగ్‌లు చేశానన్నారు. రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చి కమ్మ వ్యతిరేక పాలసీని స్టేట్ పాలసీగా మార్చారని ఆరోపించారు. దానిని జగన్ ప్రభుత్వంలో తీవ్రం చేశారని ధ్వజమెత్తారు. 2019లో అధికారంలోకి వచ్చిన మర్నాడే ఉద్యోగం లేకుండా చేశాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టింగ్, జీతం అడిగితే సస్పెండ్ చేశారన్నారు. కెరీర్‌లో ఊహించని మచ్చ వేయాలని చూశారన్నారు. చట్టం, న్యాయం రెండు తనను నిప్పుగా నిలబెట్టాయన్నారు. వరదలు, వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇచ్చిన విరాళాల్లో 75 శాతం కమ్మవారివేనని చెప్పారు. సామాజికవర్గంతో పాటు సమాజానికి సైతం అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ సీపీసీ కొసరాజు వీరయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



బోర్ల వద్ద వైర్లను కోసివేయడాన్ని చూపిస్తున్న రైతులు

# వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ చోరీ

» 25 బోర్ల వద్ద కోసివేసిన కేబుళ్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని వ్యవసాయ బోరు మోటార్ల వద్ద కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లోని 25 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను శనివారం రాత్రి చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పంటకు నీళ్లు పెట్టేందుకు ఆదివారం ఉదయం మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లిన రైతులకు కేబుల్‌వైర్లు కత్తిరించినట్లు గమనించారు. కేబుల్‌వైర్లలో ఉండే రాగితీగల కోసం దుండగులు చోరీకి పాల్పడి ఉండవచ్చని రైతులు తెలిపారు. ఆళ్ల బాలకృష్ణకు చెందిన 3బోర్ల వద్ద, ఆవాలు జోజికి చెందిన బోరు వద్ద, నూకల మహేష్‌కు చెందిన 2బోర్ల వద్ద, నువ్వుల శ్రీనివాసరావుకు చెందిన 3బోర్ల వద్దనే కాకుండా చుట్టుపక్కల సుమారు 18బోర్ల వద్ద వైర్లను కత్తిరించారని వివరించారు. చోరీ చేసిన కేబుళ్ల విలువ సుమారు 3లక్షల వరకూ ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు వైర్ల దొంగలను పట్టుకుని తమకు రక్షణ కల్పించాలని వీరవల్లి పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు. ప్రతి సీజన్‌లోను ఇదే విధంగా కేబుళ్ల చోరీ జరుగుతోందని, పంటకు నీరందించే సమయంలో కేబుళ్లను కోసివేయడంతో తడి అందక దిగుబడి తగ్గుతుందని, కేబుళ్ల చోరీతో రెండువైపులా నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

# పొగ దొంగలు!

(5వ పేజీ తరువాయి)

నకిలీ సిగరెట్లు, ఖైనీ సరుకును సీజ్ చేశారు.

**తెరవెనుక ఎవరు?**

బిహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో నకి'లీల'లు ఎక్కువగా ఉంటాయి. అక్కడ తయారవుతున్న నకిలీ సిగరెట్లను రెండు జిల్లాలకు చెందిన మాఫియా ప్రైవేటు కొరియర్లలో రప్పిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక పార్శిల్‌ను కొరియర్ చేసినప్పుడు బుక్ చేసే సమయంలో అందులో ఉన్న వస్తువులు ఏమిటి అన్నది ఆయా సంస్థల ప్రతినిధులు పరిశీలించాలి. అటువంటిది నకిలీ సిగరెట్లు ఏకంగా కొరియర్లలో రాష్ట్రాలు, నగరాలు దాటి రావడం వెనుక ఈ కొరియర్ సంస్థల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు ఈ మాఫియా ప్రత్యేకంగా కంటైనర్లను బుక్ చేసుకుని సిగరెట్లను తీసుకొచ్చేవారు. ఈ సమాచారం తెలుసుకున్న సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు టోల్‌ప్లాజాల వద్ద తనిఖీలు చేయడంతో ఈ నకిలీ సిగరెట్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కంటైనర్లు వరుసగా సీజీఎస్టీ, కస్టమ్స్ బృందాలకు పట్టుబడుతుండడంతో మాఫియా కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఉత్తరాదిలో ఉన్న కంపెనీలకు ఇక్కడ నుంచి ఆర్డర్లు ఇచ్చి కొరియర్ సంస్థల ద్వారా రప్పించుకుంటోంది. విజయవాడకు శివారున ఉన్న అజిత్‌సింగ్‌నగర్, అంబాపురం, ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లిలో కొరియర్ సంస్థలకు చెందిన గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన సరుకును మాఫియా కింద పనిచేసే ఏజెంట్లు తీసుకుంటున్నారు. గడిచిన ఏడాది బిహార్‌లోని పాట్నా నుంచి డీటీడీసీ కొరియర్‌కు వచ్చిన నకిలీ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేశారు. రూ.2.46కోట్లు విలువ ఉండే ఈ సరుకుకు ఇన్వాయిస్‌లో మాత్రం రూ.8లక్షల విలువను చూపించారు. నకిలీ సిగరెట్లతో పొగప్రియుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు పన్నులు చెల్లించకుండా గండికొడుతున్నారు. ఈ ఇన్వాయిస్‌ల మీద మాత్రం బీడీలు అని రాశారు.

# అభివృద్ధి పండగ

(5వ పేజీ తరువాయి)

బ్యాటరీ వాహనంపై ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణం, భవనాలను వీక్షించారు.

**రెస్క్యూ ఆపరేషన్‌పై మాక్ డ్రిక్**

బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు ఎలా రెస్క్యూ చేస్తాయన్న దానిపై ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. బాధితులను బయటకు తీసుకువచ్చే విన్యాసాలను ప్రదర్శించారు. ఈ విన్యాసాలను అమిత్‌షా, చంద్రబాబు ఆసాంతం వీక్షించారు.

**విపత్తుల నివారణకు ఉపయోగించే పరికరాల ప్రదర్శన**

విపత్తులను నివారించటానికి ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు ఉపయోగించే పనిముట్లను కూడా ఈ సందర్భంగా ప్రదర్శనకు పెట్టారు. ఆయా పరికరాల గురించి వాటి వినియోగం గురించి ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు వివరించారు.

**ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణంలో మొక్కలు నాటిన అతిథులు**

ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు తలా ఒక మొక్క నాటి నీరు పోశారు.

# వలకట్ల ఆదాయం బొక్కేశారు

(5వ పేజీ తరువాయి)

తీసుకోలేదు. ఈ నెల 17వ తేదీ రాత్రి వలకట్లకు సంబంధించిన లెక్కలపై గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు రూ.14.40 లక్షలకు సంబంధించిన లెక్కలు చెబితే ఆలయాల నిర్వహణ ఖర్చులకు ఎంతమేర కేటాయించాలో చూసుకుని మిగిలిన నగదును ఇతరత్రా పనులకు కేటాయించేలా నిర్ణయం తీసుకుందామని ప్రతిపాదన చేశారు. ఈ క్రమంలో గతేడాది నగదు ఎత్తుకుపోయిన ఘటనపై గ్రామస్తులు నిలదీస్తారనే వంకతో వైసీపీ నాయకులు పోలీసులను తమ వెంట తీసుకువెళ్లారు. పోలీసుల సమక్షంలోనే గ్రామస్తులు వలకట్లకు సంబంధించిన లెక్కలు చూపాలని, ఆలయాల నిర్వహణ కుంటుపడుతోందని వైసీపీ నాయకులను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి వైసీపీ నాయకుల తీరును తప్పుపట్టడంతో పోలీసులు గ్రామస్తులకు సర్దిచెప్పి గొడవ పెద్దదికాకుండా పరిస్థితిని చక్కదిద్దారు. అయితే పోలీసులు వైసీపీ నాయకులకు వంతపాడటంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



నిందితుడు, మత్తు మందుకు వినియోగించే ముడి పదార్థాలతో ఎక్సైజ్ పోలీసులు

# నిందితుల అరెస్టు

» 73 కిలోల ముడిపదార్థాలు స్వాధీనం

విస్సన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంచలనం రేపిన మత్తు మందుల తయారీకి వినియోగించే ముడిపదార్థాలు కలిగి ఉన్న కేసులో నిందితుడు భీమిరెడ్డి వెంకట రెడ్డిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం కలగర రామచంద్రాపురంలో అరెస్టు చేశారు. ముడిపదార్థాల తయారీకి వినియోగించే మిషన్‌తో పాటు 73 కిలోల ముడిపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్‌శర్మ ఆదేశాల మేరకు సీఐ కె.విద్యాసుధాకర్ అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుడి వద్ద లభించిన రా మెటీరియల్ నార్కొటెక్ డ్రగ్స్‌కు సంబంధించినదిగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.



ట్రెజరీ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

# కృష్ణా ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా లోకేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ట్రెజరీ శాఖ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా కేవీ లోకేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మచిలీపట్నం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేవీ లోకేశ్వరరావు అధ్యక్షుడిగా, కేవీ రమణ కార్యదర్శిగా, పి.ఆదిశేషు సహాధ్యక్షుడిగా, ఎ.శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా పీవీ నాగేంద్రరావు, కేవీఎస్ ప్రసాద్, ఎంవీపీ శ్రీదేవి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ వహబ్, వి.శ్రీనివాసరావు, పి.రోజాలు కోశాధికారిగా ఎ.సోమశేఖర్ ఎన్నికయ్యారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు సహకరించాలి

» పాస్మ రాష్ట్ర కమిటీ నేతలు

ధర్నాచౌక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ సెక్యూరిటీ మెంబర్స్ అసోసియేషన్ (పాస్మ) రాష్ట్ర అధ్యక్షుడిగా బొండలపాటి వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజులపాటి నాగేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. నగర ప్రధానకార్యదర్శిగా బూరగడ్డ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ మేకల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జి.బ్రహ్మయ్యలు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో అర్హత కలిగిన సెక్యూరిటీ ఏజెన్సీలకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని నూతన కార్యవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి ఏజెన్సీలకు అన్ని రకాల సహకారం అందించాలన్నారు.

## గన్నవరం సబ్‌జైల్ తనిఖీ

**గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక సబ్‌జైల్‌ను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ కె.జయలక్ష్మి ఇతర అధికారులతో కలసి ఆదివారం పరిశీలించారు. తొలుత రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి జైలులో భోజన వసతి గురించి ఆరా తీశారు. ప్రేయర్ హాల్‌ను శుభ్రం చేయాలని సూచించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, అధికారులు స్వాతి, వెంకట్రావు, రజని, పద్మరాణి, హిమబిందు, శ్రీనివాసరావు, రామినేని రవిబాబు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం!

- తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు





ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులో తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం.. మరో స్తంభం పక్కన తవ్వి వదిలివేసిన గుంత

**(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)**

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులో విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూల తాయో తెలి యని పరిస్థితుల్లో ప్రమాదం పొంచి ఉంది. కళాశాలకు వెళ్లే విద్యార్థులు, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల రాకపోకలతో అనునిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఓ ఇనుప స్తంభం కింద భాగం తుప్పుపట్టగా, దీని పక్కనే ఉన్న మరో సిమెంట్ స్తంభం మధ్యలో విరిగి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం మార్చేందుకు ఒకదాని పక్కన కొద్ది రోజుల క్రితం గుంత తవ్వి వదిలి వేశారు. రాత్రి వేళ రోడ్డుపక్కనే ఉన్న గుంతలో పడి గాయపడే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా స్తంభాలు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

## కనిపించకుండా పోయిన తల్లీకొడుకు భర్తకు అప్పగింత

**హనుమాన్‌జంక్షన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** బాపులపాడుకు చెందిన వివాహితను తన నాలుగేళ్ల కొడుకుతో పాటు జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఐటీఐ రోడ్డులో నివాసం ఉండే వివాహిత ఈ నెల 3న ఆమె నాలుగేళ్ల కుమారుడుతో కలిసి మార్కెట్‌కు అని వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 8న కేసు నమోదు చేసిన ఎస్సై సురేష్ దర్యాప్తు చేపట్టారు. ఆమె విశాఖపట్నంలో ఉన్నట్టు కనుగొన్నారు. . శనివారం తల్లీకొడుకులను అదుపులోకి తీసుకొని భర్తకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

## వైద్యశిబిరానికి విశేషస్పందన

**పెనమలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఆదివారం కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వర్ధన్, సింగం సుబ్రహ్మణ్యం, ముప్పవరపు చంద్రం, బలగం కొండ పాల్గొన్నారు.

## దాసాంజనేయస్వామి ఆలయానికి రూ.25 వేలు విరాళం

**హనుమాన్‌జంక్షన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక బాపులపాడు దాసాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన ఆర్‌కే. బోర్‌వెల్స్ అధినేత మేడికొండ రామకృష్ణ రూ.25వేలు విరాళం అందించారు. ఆదివారం మేడికొండ రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు వడ్లల్లి లక్ష్మికి విరాళం అందజేశారు.

## టీడీపీ నాయకుడు నెక్కలపూడి సుధాకర్ మృతి

**నేత్రాలు దానం**

**కంకిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** టీడీపీ సీనియర్ నాయ కులు నెక్కలపూడి సుధాకర్ (65) మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. కంకిపాడుకు చెందిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నెక్కలపూడి సుబ్బారావు సోదరుడు సుధాకర్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సుధాకర్ నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. సుధాకర్ మృతదేహాన్ని సందర్శించిన వారిలో టీడీపీ నాయకులు గోగినేని వెంకటరమణ, చలవాది రాజా, వణుకూరు విక్రం, కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి, జెఎంజె సిస్టర్ అంథోనమ్మ

## అద్భుత దివ్య బాలయేసు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** అద్భుత దివ్య బాల యేసు మహోత్సవ సందర్భంగా నిర్వహించే ప్రార్థనల పోస్టర్‌ను విచారణ ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి ఆదివారం ఆవిష్కరించారు. పెరికీడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జనవరి 22వ తేదీ నుంచి నవ దిన ప్రార్థనలు ప్రారంభమౌతాయన్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ అద్భుత దివ్య బాలయేసు తిరునాళ్లు జరుగుతాయని పారిస్ కౌన్సిల్ అధ్యక్షుడు గుడిసె రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో జెఎంజె సిస్టర్ అంథోనమ్మ, మంజుల, జి.వి. రత్నం, సింగవరపు సాల్మన్‌రాజు, పోట్ల సురేష్, ఇంజుమాల కాంతారావు, ప్రత్తిపాటి సుధీర్, సంఘస్తులు పాల్గొన్నారు.

## పశువులను రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

**ఉంగుటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** రెండు మినీ వ్యాన్లలో అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న ముగ్గురిని ఆదివారం ఆత్కూరు పోలీసులు అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేశారు. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన కోన జగదీష్, కోడెబోయిన బాబ్జి, జి.మాడుగులకు చెందిన డొమ్మేటి సాయి మణికంఠ కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని పలు ఏజెన్సీ గ్రామాల్లో పశువులను కొని చిలకలూరిపేట సంతకు తరలిస్తున్నారు. ఆదివారం రాత్రి చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్సై పశువులను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ అమ్మన్న, డాక్టర్ శ్రీలక్ష్మి

## కిడ్నీ సమస్యలపై అవగాహన ఉండాలి

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** మానవుని రక్తంలో మలి నాలను, విషతుల్యాలను శుద్ధి చేస్తూ ఆరోగ్యంగా ఉంచడమే మూత్రపిండాల(కిడ్నీ)ల ప్రధాన విధిఅని కిడ్నీ సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని డాక్టర్ అమ్మన్న అన్నారు. అంపాపురం, కోడూరుపాడు గ్రామాల్లో అరుణ్ కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనవసరంగా అధిక మోతాదులో మందులు వాడటం, నీరు తక్కువగా సేవించడం, బీపీ, జన్యుపరమైన లోపాల లాంటి వాటి వల్ల మూత్రపిండాల్లో రాళ్లు, ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదముందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు సరిపడినంత నీరు సేవించడం తప్పనిసరిగా చేయాలన్నారు. డాక్టర్ అమ్మన్న, డాక్టర్ లక్ష్మిలతో కూడిన బృంద సభ్యులు రెండు గ్రామాల్లోను 427మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అంపాపురం సర్పంచ్ కాకాని సంజయ్, యాళ్ల శ్రీధర్, చందు శ్రీనివాసరావు వైద్యశిబిరాలను పర్యవేక్షించారు.

## పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటా

**జనసేన పార్టీ నాయకుడు ముప్పా రాజా**

**కంకిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తాను ఎప్పుడు ప్రవర్తించలేదని, తన వల్ల జరిగిన పొర పాట్లను పార్టీ అధిష్టానం పెద్ద మనస్సు చేసుకొని మన్నించాలని జనసేన పార్టీ నాయకుడు ముప్పా రాజా అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ కార్యాకర్తలు పెద్ద సంఖ్యలో తన వద్దకు వచ్చి జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని కోరటం జరిగిందని, దీంతో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో కంకిపాడులో ఎడ్ల పందేలు, పూటి లాగుడు పోటీలు, ముగ్గుల పోటీలతో పాటు సంప్రదాయ బద్ధంగా కోడి పందేలు నిర్వహించటం జరిగిందని తెలిపారు. గిట్టని వారు తాను పార్టీ మారుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ఆలోచన లేదని తేల్చి చెప్పారు.

## 78 మందికి గ్రహణం మొర్రి ఆపరేషన్లు

**గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** చిన్నారుల మోములో చిరునవ్వును చూపించేందుకు ఆపరేషన్ స్మైల్ చేస్తున్న సేవలు అభినందనీయమని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వర రావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధన ఆస్పత్రిలో ఆపరేషన్ స్మైల్ స్వచ్ఛంద సంస్థ, పిన్నమనేని సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఆదివారం వరకూ ఉచితంగా గ్రహణం మొర్రి, అంగిలి చీలిక ఆపరేషన్లను ఉచితంగా చేశారు. ఆపరేషన్‌లు చేసిన వైద్యులకు, సిబ్బంది అభినందన సభ నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, డాక్టర్ జె.కళ్యాణి, రోహిత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు



పూజలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

## ఆంజనేయస్వామికి వైవీబీ ప్రత్యేక పూజలు

**ఉయ్యూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** శ్రీసువర్చలఆంజనేయ స్వామి ఆలయంలో సరసభారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్కృతి సంప్రదాయాలు గుర్తుచేస్తూ సరస భారతి అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రచయితల సంఘం నాయకుడు పూర్ణచంద్, సరసభారతి సభ్యులు శ్యామలాదేవి, రమణ, ఆంజనేయులు, పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాలడుగు సేవలు చిరస్మరణీయం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :** వేలేరు గ్రామంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నవోదయ పాఠశాల మంజూరు చే యించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాలడుగు వెంకట్రావు చేసిన కృషి చిరస్మరణీయమని మాజీ జెడ్పీటీసీ సుంకర బోస్ అన్నారు. వేలేరు అమ్మ నిలయంలో ఆదివారం మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు 10 వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ట్రస్టీ కాకాని బాబు, అవిర్నేని రాధాకృష్ణలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలడుగు వెంకట్రావు రచించిన పుస్తకాలలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి శ్రీనివాసరావు, అవిర్నేని రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ సుంకర సునీత, అరిగల విజయ్, వడ్లమూడి నాగేశ్వరరావు, దోనవల్లి మురళీకృష్ణ, చింతా లక్ష్మీరాఘవన్, నందిగం రామకృష్ణ, కన్నిగంటి రామ్మోహనరావు, వెనిగళ్ల వెంకటేశ్వరరావు, గంధం నారాయణ, కలపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ సుంకర బోస్, కాకాని బాబు అవిర్నేని రాధాకృష్ణ

# కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

**వామపక్షాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన**

**గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్ళం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సెంటర్‌లో గోబ్యాక్ అమిత్‌షా అంటూ వా మపక్షాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవ మానించిన అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయా లన్నారు. వామపక్ష నాయకులు పెద్ది వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, కట్టవరపు విజయరావు, కె.మోహనరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బేతా శ్రీనివాసరావు, మిరప నాగేశ్వరరావు, బడుగు మరియదాసు, సూరగాని సాంబశివరావు, గుండెమెడ ఉదయ భాస్కర్, ప్రసాద్, కైలే ఏసుదాసు, అజ్మీర్ వెంకటేశ్వరరావు, మాదిరెడ్డి చిన్న పాల్గొన్నారు.




గన్నవరం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు



యనమలకుదురులో అంబేడ్కర్ విగ్రహం వద్ద..

**యనమలకుదురులో..**

**పెనమలూరు :** పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని వామపక్షాలు డిమాండ్ చేశా యి. హోంమంత్రి విజయవాడ పర్యటనకు వచ్చిన సందర్భంగా యనమలకుదురులో వామపక్ష పార్టీల ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఎం మండల కార్యదర్శి కాసిం మాట్లాడుతూ, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా రాజ్యాంగబద్ధంగా ఎన్నికై హోం మంత్రిగా వ్యవహరిస్తున్న అమిత్‌షా.. అంబేడ్కర్‌ను అవమానిస్తూ పార్లమెంటులో మాట్లాడడం క్షమించరానిదని, అందుకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మున్నంగి నరసింహరావు మాట్లాడుతూ, అమిత్‌షా మాట్లాడిన మాటలకు ప్రధాని మోదీ జాతికి క్షమాపణ చెప్పి అమిత్‌షాపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మరీదు ప్రసా ద్, ఉప్పాడ త్రిమూర్తులు, షేక్ మస్తాన్‌వలి, షేక్ బాబు, పాతాళ లక్ష్మి, వాటపల్లి శ్రీరాములు, కొప్పుల కోటేశ్వరరావు, వాటపల్లి ఇజ్రాయేలు, కొప్పుల విజయ్‌బాబు, మాదు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**బండారుగూడెంలో..**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్, మాదు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బండారుగూడెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ మాజీ సభ్యుడు కొల్లబత్తిన నాగేంద్ర, కాంగ్రెస్ నేత కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బండారుగూడెంలో..

### బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 143, 152, 163 |
| చికెన్ విత్ స్కిన్ | 276 |
| చికెన్ స్కిన్‌లెస్ | 286 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

### వాహదారులకు హెల్మెట్ తప్పనిసరి

**గుడివాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, రహదారి భద్రతా నియమాలను పాటించాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో హెల్మెట్ లేని వాహనచోదకులకు గులాబీ పువ్వులిచ్చి హెల్మెట్ పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు గులాబీ పువ్వు ఇస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

# అగ్నిప్రమాదానికి పూరిళ్లు ఆహుతి

**గుడ్లవల్లేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** వడ్లమన్నాడు దళితవాడలో ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదానికి నాలుగు పూరిళ్లు ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని బాధితులు, స్థానికులు చెబుతున్నారు. జంగం శ్రీనివాసరావు, జంగం నాగేంద్రరావు, నత్తా సుబ్బారావు, మాచవరపు రోసయ్యకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో బయటపడ్డారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం, తొలుత గ్రామస్థులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేసినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా సంఘటనా స్థలానికి తహసీల్దార్ లోకరాజు బాధితులను పరామర్శించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచనమేరకు బాధితులకు తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. బాధితులను గ్రామ వైస్‌సర్పంచ్ గరికపాటి రాంబాబు, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి, వడ్లమన్నాడు టీడీపీ అధ్యక్షుడు పెన్నేరు రమేష్ పరామర్శించారు. ప్రభుత్వ సాయానికి కృషిచేస్తానని తహసీల్దార్ లోకరాజు హామీ ఇచ్చారు.



వడ్లమన్నాడు దళిత వాడలో అగ్నికి ఆహుతైన ఇళ్లు



మంటల్లో కాలిపోయిన సామగ్రి

### రహదారి నిర్మాణ పనుల పరిశీలన

**అవనిగడ్డ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** పులిగడ్డ పంచాయతీ పరిధిలో నిర్మించిన రహదారులను సర్పంచ్ దాసరి విజయ్‌కుమా ర్ ఆదివారం పరిశీలించారు. రహదారి నిర్మాణాల గురించి సచివాలయ ఏఈ భార్గవ్ వారికి వివరించారు. పాతకోటలో 33 రహదారులను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లింగమనేని స్రవంతి, ఎండ్లూరి సుస్మిత

### ఉపాధ్యాయులకు నేషనల్ అవార్డులు

**గుడివాడ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్ నందు సదరన్ ప్రైవేట్ లెక్చరర్, టీచర్స్ ఆర్గనైజేషన్ వారు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గుడివాడ శ్రీ సాయి షైనింగ్ స్టార్ స్కూల్ ప్రిన్సిపాల్ లింగమనేని స్రవంతికి ఉమెన్ ప్రిన్సిపల్ విభాగంలో, అదే స్కూల్‌లో పని చేస్తున్న ఎండ్లూరి సుస్మితకి సీనియర్ టీచర్ విభాగంలో సావిత్రిభాయి పూలే నేషనల్ అవార్డు-2025 అందుకున్నారు. ఒకే స్కూల్ నుంచి రెండు అవార్డులు స్వీకరించినందుకు సంతోషంగాఉందని పాఠశాల యాజమాన్యం జగదీష్ పేర్కొన్నారు.



తారకరామా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

### వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడి ఎన్నిక


**గుడివాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** తారకరామా వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా మెరుగుమాల బ్రహ్మయ్య, బచ్చు రాధాకృష్ణ, కోశాధికారిగా పంది నాంచారయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక జీవన్ పబ్లిక్ స్కూల్‌లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ గార్డియన్ కొల్లాబత్తుల రామకృష్ణ, పూర్వ అధ్యక్షుడు దోరెడ్ల శ్యాంబాబు పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకుడు

### కొండాలమ్మ సన్నిధిలో న్యాయాధికారులు

**గుడ్లవల్లేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం మచిలీపట్నం స్పెషల్ జడ్జి ఎం.వెంకట వారాహిని, కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వి.వీర నాగ వెంకట లక్ష్మి వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కాగా ఆదివారం అమ్మవారిని 25,000 మంది భక్తులు దర్శించుకొన్నారని ఈవో కొండలరావు తెలిపారు.



నివాళులర్పిస్తున్న కుమార్ రాజా

### మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్యకు ఎమ్మెల్యే నివాళి

**కూచిపూడి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తండ్రి మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా మొవ్వ మండలం కారకంపాడు గ్రామంలో ఆదివారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆయన సేవలను కొనియాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, అభిమానులు రెడ్డయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

### రెండెకరాల వరి గడ్డివామి దగ్ధం

**కూచిపూడి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** కూచిపూడి గ్రామానికి చెందిన వెన్నం శివ అర్జునరావుకు చెందిన రెండు ఎకరాల వరి గడ్డివామి దగ్ధమైంది. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. సమాచారం అందుకున్న మొవ్వ అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

# అమిత్‌షా రాజీనామా చేయాలి

● వామపక్ష నేతల నిరసనలు

**గుడివాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో వామపక్ష నేతలు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు ఆర్‌సీపీ రెడ్డి, చింతలూరి సత్యనారాయణ మాట్లాడుతూ అమిత్‌షా మతోన్మాదం నశించాలని, రాజ్యాంగం పుణ్యమా అని అమిత్‌షా కేంద్ర హోంమంత్రి అయ్యారని గుర్తు పెట్టుకోవాలన్నారు. తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొమ్ము సురేష్, లంకా సురేంద్ర, రేపాని కొండ, కొమరవోలు లక్ష్మణరావు, బసవ అరుణ, వేశపోగు యేషయ్య, నారాయణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, నాంచారయ్య, ఎలీషారావు తదితరులు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

### సముద్ర స్నానం చేసేటప్పుడు పిల్లలు జాగ్రత్త

**కోడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పాలకాయితిప్ప బీచ్ వద్ద సముద్ర స్నానం చేసేటప్పుడు పర్యాటకులు తమ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి హంసలదీవి బీచ్‌కు వచ్చిన పర్యాటకులకు మెరైన్ సీఐ సూచనలు, సలహాలు అందించారు. సముద్ర తీరం వెంట మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి, పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు.

### పంట కాలువలో మృతదేహం

**కోడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని వి.కొత్తపాలెం గ్రామం వద్ద అవనిగడ్డ నుంచి కోడూరు వచ్చే పంట కాలువలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం పంటకాలువలో చెట్లకు చిక్కుకుని 25 నుంచి 30 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహం కనిపించిందని వీఆర్వో బి.వెంకటేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చాణక్య తెలిపారు. మృతుడి దేహంపై ఫుల్‌హ్యాండ్స్ తెలుపుచెక్స్ షర్టు, మెరూన్ కలర్ డ్రాయర్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయన్నారు. రెండు చేతులకు, పొట్ట మీద మెడ భాగాన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతుడి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### మసీదుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పంబలగూడెం హజ్రత్ బిలాల్ మసీదులో ఖురాన్ పక్కన చెప్పులు ఉంచి అవమానపరిచిన దుండగులను అరెస్టు చేయాలని ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. గొడుగుపేటలో ఆదివారం నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ, ముస్లిం సమైక్యతకు మచిలీపట్నం చిహ్నంగా ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు కోరారు. మైనంపూడి సాయిబాబు, విన్నకోట సుబ్బారావు, కూనపరెడ్డి బ్రహ్మయ్య, చలమలశెట్టి మల్లేశ్వరరావు, సూరిశెట్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీలో స్మార్ట్ మీటర్లు వద్దు

● టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ

**గుడివాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** టిడ్కో కాలనీలో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి అంగీకరించేది లేదని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ స్పష్టం చేశారు. ఆదివారం గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి అంగీకరించబోమని, అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ ధర్నాలో కమిటీ అధ్యక్షురాలు నూర్జీసా, ఉపాధ్యక్షులు శివరాంప్రసాద్, రాంబాబు, గణేష్, రంగమ్మ, మాధవి పాల్గొన్నారు.



టిడ్కో కాలనీలో ధర్నా నిర్వహిస్తున్న టిడ్కోవాసులు

### రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

**ఘంటసాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పశువైద్య శిబిరాలను మంగళవారం నుంచి మండలంలో నిర్వహిస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్ సూచించారు. ఆదివారం ఘంటసాలలో ఆయన మాట్లాడారు. ఈనెల 21 వ తేదీన ఘంటసాల, 23న చినకళ్లేపల్లి, 24న చిట్టూరు, 25న కొడాలి, 27న తాడేపల్లి, 28న పాపవినాశనం, 29న వి.రుద్రవరం. 30న దేవరకో ట, 31న మల్లంపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. నట్టల నివారణ కార్యక్రమాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, అవగాహన సదస్సులు, వైద్యసేవలు అందిస్తామన్నారు.

### మహిళ వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

**అవనిగడ్డ, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** మధుమేహం కారణంగా రెండు కాళ్లు చచ్చుబడిపోయి తొలగించాల్సిన స్థితిలో ఉన్న మోపిదేవి శివారు ప్రశాంత్‌నగర్ వాసి కాకి నాగమణి వైద్యానికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సాయమందించారు. తిరుపతిలోని రుయా ఆస్పత్రికి ఆమెను తరలించాల్సి ఉండగా, ఆస్పత్రికి పంపేందుకు దారి ఖర్చులు, వైద్య ఖర్చులకు నగదు లేదని తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ వెంటనే ఆమెను తిరుపతికి తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. రుయా వైద్యులతోనూ మాట్లాడి నాగమణి కుటుంబానికి భరోసా కల్పించారు.

# అమిత్‌షా సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు



జెండా ఊపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు

**గుడివాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):** గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు గుడివాడ నుంచి రెండు బస్సుల్లో బీజేపీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, నేతలు సూరే గాంధీ, యర్రపోతు అర్జున్, కేకేబీ ప్రసాద్, మాచర్ల రామకృష్ణ, వాసుపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా వైద్యశిబిరాలు

**గుడివాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెద్ద వీధిలోని సంఘం బడిలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ శివకోటేష్, డాక్టర్ సందీప్, డాక్టర్ అజయ్ వైద్య పరీక్షలు నిర్వహించి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు సహకారంతో ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని టీడీపీ నేతలు చేకూరు జగన్మోహనరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆరుగురికి గుండె సమస్యలున్నట్టు గుర్తించి చికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేశారు. క్లబ్ ఎలక్ట్ జిల్లా గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, పూర్వ గవర్నర్ పర్వతనేని చంద్రశేఖర్, అధ్యక్షుడు కొన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాస్, కోశాధికారి చింతా రామకృష్ణ, శివరామకృష్ణ, కుటుంబరావు, చిట్టిబాబు, రామకృష్ణ, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రామ్మోహన్ పాల్గొన్నారు.





రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యబృందం



కళ్లజోళ్లను అందజేస్తున్న టీడీపీ నేతలు జగన్మోహనరావు

**రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..**

స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్లు, ప్రభావతి, చలసాని రాయన్‌చౌదరి జ్ఞాపకార్థం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మందికి వైద్యసేవలందించారు. డాక్టర్ కార్తీక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ విష్ణు వైద్యసేవలందించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు ఎం.రమణమూర్తి, బి.శంకరరావు, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 143, 152, 163 |
| చికెన్ విత్ స్కిన్ | 276 |
| చికెన్ స్కిన్‌లెస్ | 286 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.500

## 2023లో పదోన్నతి పొందిన హెచ్ఎంలకు బదిలీల్లో అవకాశం కల్పించాలి

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** కృష్ణాజిల్లాలో 2023 జూన్‌లో పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల తేడాతో రెండేళ్ల సర్వీసు పూర్తి కాదని, దీనివల్ల బదిలీల్లో ప్రధానోపాధ్యాయులకు అవకాశం లేకుండా పోతోందని ఆయన తెలిపారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్బారాయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**మోపిదేవి, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో డి.శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు ఇబ్బందికలగకుండా అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# బస్టాండ్ కిటకిట



హైదరాబాద్ వెళ్లే బస్సుల కోసం అవనిగడ్డ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

**అవనిగడ్డ, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన వారు ఆదివారం తిరిగి వెళుతున్నారు. చాలినన్ని బస్సులు అందుబాటులో లేకపోవటంతో అవనిగడ్డ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. అవనిగడ్డ డిపో నుంచి రోజూ వెళ్లే సర్వీసులకు అదనంగా మరో 18 బస్సులను డిపో యాజమాన్యం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ ప్రయాణికులు భారీగా రావడంతో బస్టాండ్ ఆవరణ కిటకిటలాడింది. మొత్తం సర్వీసులన్నింటినీ హైదరాబాద్ రూట్‌కు మళ్లించటంతో గుడివాడ, విజయవాడ వెళ్లే సర్వీసులు తగ్గిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీ తీవ్రంగా ఉన్నప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం చార్జీలు పెంచకపోవడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. అదనంగా మరికొన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు.



పాలకాయితిప్ప బీచ్‌లో పర్యాటకులకు సూచనలిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

## సముద్ర స్నానం చేసేటప్పుడు పిల్లలు జాగ్రత్త

**కోడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పాలకాయితిప్ప బీచ్ వద్ద సముద్ర స్నానం చేసేటప్పుడు పర్యాటకులు తమ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి హంసలదీవి బీచ్‌కు వచ్చిన పర్యాటకులకు మెరైన్ సీఐ సూచనలు, సలహాలు అందించారు. సముద్ర తీరం వెంట మెరైన్ ఎస్సై పూర్ణమాధురి, పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు.

## పంట కాలువలో మృతదేహం

**కోడూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని వి.కొత్తపాలెం గ్రామం వద్ద అవనిగడ్డ నుంచి కోడూరు వచ్చే పంట కాలువలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం పంట కాలువలో చెట్లకు చిక్కుకుని 25 నుంచి 30 ఏళ్ల వయసున్న పురుషుడి మృతదేహం కనిపించిందని వీఆర్వో బి.వెంకటేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చాణక్య తెలిపారు. మృతుడి దేహంపై ఫుల్‌హ్యాండ్స్ తెలుపుచెక్స్ షర్టు, మెరూన్ కలర్ డ్రాయర్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయన్నారు. రెండు చేతులకు, పొట్ట మీద మెడ భాగాన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతుడి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## మసీదుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పంబలగూడెం హజ్రత్ బిలాల్ మసీదులో ఖురాన్ పక్కన చెప్పులు ఉంచి అవమానపరిచిన దుండగులను అరెస్టు చేయాలని ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి డిమాండ్ చేశారు. గొడుగుపేటలో ఆదివారం నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ, ముస్లిం సమైక్యతకు మచిలీపట్నం చిహ్నంగా ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు కోరారు. మైనంపూడి సాయిబాబు, విన్నకోట సుబ్బారావు, కూనపరెడ్డి బ్రహ్మయ్య, చలమలశెట్టి మల్లేశ్వరరావు, సూరిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.

## రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

**ఘంటసాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** పశువైద్య శిబిరాలను మంగళవారం నుంచి మండలంలో నిర్వహిస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్ సూచించారు. ఆదివారం ఘంటసాలలో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ తేదీన ఘంటసాల, 23న చినకళ్లేపల్లి, 24న చిట్టూరు, 25న కొడాలి, 27న తాడేపల్లి, 28న పాపవినాశనం, 29న వి.రుద్రవరం. 30న దేవరకోట, 31న మల్లంపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. నట్టల నివారణ కార్యక్రమాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, అవగాహన సదస్సులు, వైద్యసేవలు అందిస్తామన్నారు.

## రహదారి నిర్మాణ పనుల పరిశీలన

**అవనిగడ్డ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** పులిగడ్డ పంచాయతీ పరిధిలో నిర్మించిన రహదారులను సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. రహదారి నిర్మాణాల గురించి సచివాలయ ఏఈ భార్గవ్ వారికి వివరించారు. పాతకోటలో 33 రహదారులను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మహిళ వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

**అవనిగడ్డ, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** మధుమేహం కారణంగా రెండు కాళ్లు చచ్చుబడిపోయి తొలగించాల్సిన స్థితిలో ఉన్న మోపిదేవి శివారు ప్రశాంత్‌నగర్ వాసి కాకి నాగమణి వైద్యానికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ ఆర్థికసాయమందించారు. తిరుపతిలోని రుయా ఆస్పత్రికి ఆమెను తరలించాల్సి ఉండగా, దారి ఖర్చులు, వైద్య ఖర్చులకు నగదు లేదని తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ వెంటనే ఆమెను తిరుపతికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రుయా వైద్యులతోనూ మాట్లాడి నాగమణి కుటుంబానికి భరోసా కల్పించారు.

## కంటి శస్త్రచికిత్స కోసం రూ.50వేల సాయం

**చల్లపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** కంటి శస్త్రచికిత్స కోసం ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు రూ.50వేల సాయమందించారు. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన కాకాని గౌరీశంకర్ ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంటాడు. అంధత్వానికి గురిచేసే రెటీనిటీస్ పిగ్మెంటోసా అనే వ్యాధిబారిన పడటంతో కంటికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్ కావడంతో ఐవీఎం డైరెక్టర్ సురేష్‌ను సహాయం కోరాడు. స్పందించిన సురేష్-రోజా దంపతులు ఐవీఎం సంస్థ ద్వారా రూ.50వేల సహాయం అందించారు. దాతల సహకారంతో గౌరీశంకర్‌కు ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఐవీఎం డైరెక్టర్ సురేష్‌కు గౌరీశంకర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

## 85 మందికి నేత్ర పరీక్షలు

**నాగాయలంక, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** దివంగత తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెదకాకాని కంటి ఆస్పత్రి వైద్యురాలు నీతా నేత్ర పరీక్షలు చేశారు. 85 మందికి పరీక్షలు చేయగా, 63 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, తలశిల లీలామనోహర్, గంగాధర్, తలశిల రవి, మత్తి శివ పర్యవేక్షించారు.

# అమిత్ షా గో బ్యాక్

• అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీపీఐ నిరసన




రుస్తుంబాద శివాలయం సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోం అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఐ నాయకులు నినాదాలు చేశారు. రాజ్యసభలో అంబేడ్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు వ్యతిరేకంగా ఆదివారం రుస్తుంబాద శివాలయం సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమిత్ షా వ్యాఖ్యలను వామపక్ష నాయకులందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నామని సీపీఐ నేత మోదుమూడి రామారావు అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. లింగం ఫిలిప్, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకుడు తురగా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం, రమణయ్య, నరేంద్రకుమార్, రాము పాల్గొన్నారు.



తమ వసతిగృహంలో పెరిగిన అనాథలకు పెళ్లి జరిపిస్తున్న బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్

# శెభాష్..బెరాకా!

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** అనాథలైన వారిద్దరినీ చదివించి, ప్రయోజకులను చేస్తే చాలనుకోకుండా పెళ్లి చేసి మంచి మనసు చాటుకుని అందరితోనూ శెభాష్ అనిపించుకున్నారు..బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్. బైరాగిపాలెంలోని తమ అనాథల వసతి గృహంలో విద్యనభ్యసించిన రమ్య, కార్తీక్‌లకు ఆదివారం రాత్రి ఆయన వివాహాలు జరిపించారు. అనాథలు కావడంతో బెరాకా హాస్టల్‌లో వసతి సదుపాయాలు కల్పించి, చదివించారు. ప్రస్తుతం రమ్య, కార్తీక్ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. వివాహ కార్యక్రమంలో మత పెద్దలు విజయరాజు, డానియేల్, జేవీఆర్, డానీ, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోనేరు సెంటర్ రింగ్ చుట్టూ ఫ్లెక్సీలు, బ్యానర్లు కడితే చర్యలు

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** కోనేరు సెంటర్ రింగ్ చుట్టూ ఫ్లెక్సీలు, బ్యానర్లు కడితే చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ బాపిరాజు హెచ్చరించారు. ఈ మేరకు కోనేరుసెంటర్‌లో ఆయన బోర్డు పెట్టించారు.




కోనేరుసెంటర్‌లో నగర పాలక సంస్థ అధికారులు వేలాడదీసిన హెచ్చరిక బోర్డు

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

**నాగాయలంక, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** పర్రచివర శివారు గ్రామం బిల్లీ గ్రాహంనగర్‌లో శనివారం రాత్రి గుర్ర స్వామేరు గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఇంటిలో మంటలు వ్యాపించి టీవీ, ఫ్రిడ్జ్, మంచాలు, గృహోపకరణాలు కాలిపోయాయని ఆయన తెలిపాడు. ఈ ప్రమాదం నుంచి ఇంట్లో ఉన్నవారు త్రుటిలో బయటపడ్డారు. పర్రచివర సర్పంచ్ మంచాల శ్రావణి, టీడీపీ నేత మంచాల తిరుపతి వరప్రసాద్ పరామర్శించారు.



నవీన్‌మిట్టల్ కాలనీలో రోడ్డు పక్కన చెత్త

# చెత్త తొలగించండి

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** బందరు మండలం మేకావారిపాలెం శివారు నవీన్‌మిట్టల్ కాలనీలో రోడ్డు పక్కన చెత్త పడేస్తున్నారు. దానిని తొలగించడం లేదు. దీంతో కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీవాసులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## యోగా దినచర్యలో భాగమవ్వాలి

**ఘంటసాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** రోజూ కొంతసేపు యోగా చేయడం శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. లంకపల్లిలోని సత్యసాయి ధ్యాన మండలిలో యోగ శ్రీనివాస గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గాయకుడు పెనుమాక వెంకట కృష్ణ, చల్లపల్లి మాజీ ఎంపీపీ బోలెం నాగమణి, బోలెం రామారావు, సద్గుణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కోట విజయరాధిక



చిత్రలేఖనం పోటీల్లో విజేతలతో డీవైఈవో శేఖర్‌సింగ్

## విద్యతోపాటు కళలనూ అభ్యసించాలి

• విద్యార్థులకు డీవైఈవో శేఖర్‌సింగ్ సూచన

**మచిలీపట్నం టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** విద్యతో పాటు చిత్రలేఖనం వంటి కళలను కూడా అభ్యసించాలని విద్యార్థులకు బందరు డీవైఈవో శేఖర్‌సింగ్ సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యత అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 102 మంది పాల్గొన్నారు. విజేతలకు డీవైఈవో శేఖర్‌సింగ్ బహుమతులు అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. గూడూరు ఎంఈవో సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వి.రావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మల్లవోలు జడ్పీ హైస్కూల్ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ అరుణ, ప్రవీణ్, ధనుంజయ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఉచిత సంతాన సాఫల్య పరీక్షలు

**అవనిగడ్డ, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు దివిసీమ నేతృత్వంలో ఎస్వీఎల్ క్రాంతి కళాశాలలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన వైద్యురాలు డాక్టర్ స్వప్న 18 జంటలకు ఉచిత పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయిబాబు, ఎస్వీఎల్ కళాశాల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, సిద్ధినేని అశోక్ నాయుడు, కోట రాంబాబు పాల్గొన్నారు.



## ఘనంగా నూతి ఆదివనమలమ్మ సంబరం

**మచిలీపట్నం టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** నిజాంపేటలో ఆదివనమలమ్మ సంబరాన్ని మేళతాళాలతో ఆదివారం ఘనంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ధర్మకర్త నూతి వన వెంకట సత్యనారాయణ పర్యవేక్షించారు.

## సూర్యభగవానుడికి ప్రత్యేక అర్చనలు

**మచిలీపట్నం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సూర్యభగవానుడికి ఆదివారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గ మండలి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్, భక్తులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో అర్చనలు అందుకుంటున్న సూర్యభగవానుడు

## వైభవంగా శాంతి కల్యాణం

**అవనిగడ్డ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి):** వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణాన్ని ఆదివారం ఆలయ వాస్తు సిద్ధాంతి పాకలపాటి రామచంద్రరావు పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు-ఇందిర దంపతుల ఆధ్వర్యంలో శాంతి కల్యాణం నిర్వహించాక తన తండ్రి శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో వర్రే గోపి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు దీవి నరసింహ మూర్తి స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు.



శాంతి కల్యాణం జరిపిస్తున్న వీరవసంతరావు దంపతులు



**ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ**
**ఇ ప్రొక్యూర్ మెంట్ నోటీసు**

ఇ - ప్రొక్యూర్ మెంట్ ద్వారా శ్రీ నాగేంద్ర స్వామి వారి పుట్ట, కలెక్టర్ గారి బంగ్లా, మచిలీపట్నం, కృష్ణాజిల్లా నందు శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవాలయము మరియు శ్రీ నాగేంద్ర స్వామి వారి పీఠం నిర్మించుటకు రూ. 11-00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వహక అధికారి